


# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



**5**

# కోటా దాటిన ఏప్రిల్ నెల

అదేమిటో తెలియదు కానీ... నేను ఎప్పుడు ఇండియా వెళ్ళినా నా "దండ" యాత్రలు చాలానే జరుగుతాయి. నాకు ఎవరైనా దండ వేసి సన్మానిస్తే పైకి ఏదో సిగ్గు పడుతున్నట్టు నటించినా..లోపల్లోపల ఖుషీ గానే ఉంటుంది. గత డిసెంబర్ లో ఇండియా వెళ్ళినప్పుడు ఈ మదీయ సత్కార డిపార్ట్ మెంట్లో బాగానే బిజీగా ఉన్నాను కానీ మళ్లీ కిందటి నెల వెళ్ళినప్పుడు పరిస్థితి మారిపోయింది. అన్ని సభలలోనూను పెద్ద పెద్ద గజమాలలు నిజంగానే గొప్పవాళ్ళయిన వారికి వేసేసి, "విశిష్ట, ఆత్మీయ, ప్రత్యేక, పనీ పాటూ లేని అతిథి" అనో, వేదికని అలంకరించడానికి ఆ బాపతు అతిథులు కూడా ఎక్కువ అయిపోతే ఇక గత్యంతరం లేక " సభా ప్రారంభకులు", "పుష్పగుచ్ఛములతో అందరినీ సత్కరించు ఎన్నారైగారు" "మేము పిలవకపోయినా విచ్చేసిన ఫలానా గారు",లేదా అందరూ ఇళ్ళకి పోతున్న సమయంలో ఎవరూ వినని "వందన సమర్పణ" మొదలైన హోదాలో నన్ను ఆ అసలు, సిసలు మహానుభావుల పక్కనే "కూకో" బెట్టించుకుని, ఒక చిన్న దండ చిన్న పిల్ల చేత నాకు వేయించుకుని గౌరవం పొందాను. నా బోటి సర్వ సామాన్యుడు కూడా అదే వేదిక మీద వేళ్ళాడుతూ ఉండడం అ మహానుభావులకి ఇబ్బంది కలిగించిందేమో నాకు తెలియదు.



ఉదాహరణకి కాకినాడలో ఘనత వహించిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి తరఫున మా యంగ్మెన్స్ హేపీ క్లబ్ తాలూకు ఓల్డ్ మెన్ ఆధ్వర్యంలో "తెలుగు నాటక రంగ

దినోత్సవం” జరిగింది. కందుకూరి వీరేశలింగంగారి జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ప్రతీ ఏడూ అన్ని నగరాలోను జరుగుతుందిట. ఈ ఏడు అయన 161 వ పుట్టిన రోజు నాటి ఈ నాటకోత్సవాలకి ముఖ్య అతిథి “కళాతపస్వి” కే. విశ్వనాథ్ గారు. నేను విశిష్ట అతిథిని. “నీ మొహం, నీ కంత సీను లేదు. మరీ అంత చెవిలో పువ్వు బాపతు ఎవరూ లేరు” అని మా క్వీన్ విక్టోరియా ఖచ్చితంగా అని తీరుతుంది కాబట్టి ఎవరూ చూడకుండా నేనే నా సెల్ ఫోన్ తో ఆ కార్యక్రమం జరిగిన “సూర్య కళా మందిరం” ముందు మా ఇద్దరి పేర్లూ ఉన్న పోస్టర్ కి ఇక్కడ జతపరిచిన ఫోటో తీసేసుకున్నాను. అ రోజు పొద్దుటే విశ్వనాథ్గారు అక్కడి “గాంధీ భవన్’ చూడడానికి వచ్చినప్పుడు నన్ను కూడా పిలిచారు నిర్వాహకులు. విశ్వనాథ్ గారిని నేను ఇదివరలో అమెరికాలో చాలా సార్లు కలుసుకున్నాను కానీ ఆయనకి నేను గుర్తు ఉంటాను అని నేను అనుకో లేదు. ఆలాంటిది ఆయన నన్ను చూడగానే ఆప్యాయంగా పేరు పెట్టి పిలిచి పలకరించారు. ఇంచుమించు అ రోజంతా, మా ఊళ్లోనే ఆయనతోనే గడిపే అపురూపమైన అవకాశం నాకు దక్కింది.

అంతకు ముందు ఉగాది నాడు జరిగిన జంట కవుల అష్టావధానంలో నేను ఇండియాలో మొట్టమొదటి సారిగా అప్రస్తుత ప్రసంగం చేసాను. ఆ సంగతి ఫోన్లో చెప్పగానే “సరేలే ...కొత్తేముందీ, ఎప్పటిలాగే అవాకులూ చెవాకులూ పేలి ఉంటావు “ అని నిట్టూర్చింది మా క్వీన్ విక్టోరియా. ఇలా కాకినాడలో రెండు మూడు కార్యక్రమాలు అయ్యాక ఒకాయన “ఇంక ఇక్కడే ఉంటున్నారా?” అని అడగగానే...ఇక లాభం లేదని బిచాణా ఎత్తేసి హైదరాబాదు మకాం మార్చేశాను.

ఆ రోజునే నాకు HMTV వారి దగ్గరనుంచి ఈ మెయిల్ వచ్చింది. గొల్లపూడిగారు నా మొట్టమొదటి కథ “జులపాల కథ” ని తాను నిర్వహిస్తున్న “వందేళ్ల తెలుగు కథకు వందనాలు” అనే ధారావాహికకి ఎన్నుకుని, నన్నూ, అ కథనీ పరిచయం చేసే కార్యక్రమం నాలుగు రోజులలో ..అనగా ఏప్రిల్ 28, 2013 రాత్రి 9:30 కి ప్రసారం అవుతుంది అని ఆ ఈ-మెయిల్ సారాంశం. ఇకనేం, ఎగిరి గంతేసి వెంటనే గొల్లపూడిగారికి ఫోన్ చేసాను. నేను అమెరికాలో ఉన్నాను అని ఆయనా, ఆయన వైజాగ్ లో ఉన్నారని నేను అనుకున్నాం. కానీ, తీరా చూస్తే ఇద్దరం హైదరాబాదు లోనే పక్క, పక్క హోటేళ్ళలో ఉన్నాం. అ సాయంత్రం రవీంద్రభారతిలో ఆయన కార్యక్రమానికి వెళ్ళగానే అక్కడ కూడా విశ్వనాథ్ గారు కనిపించి “ఇక్కడ కూడా నువ్వు దాపరించావా? “ అనకుండా మళ్ళీ ఆప్యాయంగా పలకరించారు. అలాగే దాసరి గారు, సింగీతం శ్రీనివాస రావుగారితో కూడా మాట్లాడుతూ ఉండగా గొల్లపూడిగారి పక్కనే కూచున్న ఒక తెల్లటి, అందమైన అమ్మాయి నన్ను చూసి అదోలా నవ్వింది....అని అనుకున్నాను. నాకు అలాంటి అమ్మాయిలంటే అదోలా ఉంటుంది. అనుకోకుండానే కుంచించుకు పోతాను. ఎందుకంటే కుర్చీలో కూచున్నా అ పిల్ల నాకంటే పొడుగ్గా ఉంది. అంతియునే కాక నా కంటే అతి ఎక్కువ తెల్లగా కూడా ఉంది నా ప్రాణాలకి. నన్ను ఆ సుందరాంగికి ఎవరో పరిచయం చెయ్యబోతూ ఉండగా ఆ అమ్మాయి కుర్చీ లోంచి లేవగానే నేను కరచాలనం చెయ్యబోయాను. కానీ, ఆవిడ ప్రేమగా ముందుకు చాపిన కుడి చేతి వేళ్లకీ, నేను పోలో మని ఆకాశం లోకి చాపిన చేతికీ ఉన్న రెండు, మూడు అడుగుల తేడా గమనించి, అందని ద్రాక్ష పండు మనకేలా అని ఆ కరచాలన ప్రయత్నం విరమించి నమస్కార బాణం వేసే లోపుగానూ, అది ఆ అందాల రాశి అందుకునే లోపుగానూ మరెవరో మందభాగ్యుడు నన్ను

నిర్దాక్షిణ్యంగా పక్కకి తోసేశాడు. ఆ ఆరాళకుంతల పేరు తమన్నా అని తరువాత తెలిసింది. ఆ రాత్రి నాకు నిద్ర పట్ట లేదు. ఆవిడ పరిస్థితి నాకు తెలియదు.

ఇంతకీ HMTV లో గొల్లపూడి గారు నాతో చేసిన interview, వారు ప్రత్యేకంగా ప్రచురించిన "జులపాల కథ", నా గాఢ మిత్రులూ-గూఢ శత్రువులతో సహా ఆసక్తి ఉన్నవారు ఎవరైనా ఈ క్రింది లింకులలో చూడవచ్చును, చదవవచ్చును.

https://www.youtube.com/watch?feature=player_embedded&v=Iti0hQkjiQk

http://www.hmtvlive.com/HMTV/VK/2013/Apr/Episode-78.pdf

ఇక తరువాత సత్కార ప్రహసనాన్ని "భువన చంద్రహాసం" అనవచ్చును. ఆత్మీయులు, సుప్రసిద్ధ సినీ కవి భువనచంద్ర ఇప్పుడు సింగీతం శ్రీనివాస రావు గారి దర్శకత్వం లో రూపొందుతున్న "వెల్ కం ఒబామా" సినిమా షూటింగ్ కు హైదరాబాద్ వచ్చినట్టు తెలిసింది. అ మర్నాడే ఆయనకి జూనియర్ సముద్రాల అవార్డ్ ప్రదానం జరుగుతోంది అని తెలిసి, భువనచంద్ర గారిని పిలిచి ఆ సభకి నన్ను కూడా పిలిచే ఏర్పాటు చేసేసుకున్నాను. ఆ సభలో వేదికని అలంకరించిన వారిలో నలుగురైదుగురు మా ఆహ్వానం మీద అమెరికా వచ్చి సాహిత్య సభలలో పాల్గొన్న ప్రముఖులే!

అక్కడితో ఈ సభా ప్రహసనాలు అయిపోతాయి కదా...మొహం వేళ్ళాడేసుకుని వెనక్కి వెళ్లిపోవాలి కాబోలు అనుకున్న నాకు ఆ మర్నాడు ..అనగా నేను అమెరికా వెనక్కి వచ్చేసే ముందు రోజు రాత్రి (ఏప్రిల్ 26, 2013 రాత్రి) గాన గంధర్వుడు, మా బోటి వాళ్లకి "నడిచే దేవుడు" అయిన ఎస్. పి. బాల సుబ్రమణ్యం సినిమాలో 49 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకి HMTV వారు "అక్షరాంజలి" కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు అని తెలిసింది. వెంటనే ఆ సభా నిర్వాహకులు, ఆప్త మిత్రులూ అయిన సినీ కవి జొన్నవి త్తుల గారిని పిలవగానే. ఆయన మహదానందపడి నన్ను "విశిష్ట అతిథి" గా ఆ సత్కార సభకి ఆహ్వానించడమే కాకుండా, బాలూ గారికి ఒక కుర్చీ అవతలే నన్ను "కూకో" బెట్టి, ఆ సభలో మాట్లాడే అద్భుతమైన అవకాశాన్ని కలిగించారు. అది అంది పుచ్చుకుని, చిరు చెమటలు పడుతున్నా లెక్క చేయకుండా, బాలూ గారితో నాకున్న 33 సంవత్సరాల కొద్ది పాటి పరిచయాన్ని, అతిశయోక్తులు లేకుండా చెప్పగలిగాను. బాలూ గారికి జరిగిన ఆ అఖండ అక్షర మరియు పుష్పాంజలి కార్యక్రమంలో పాల్గొన్న వారు దాసరి నారాయణ రావు, మండలి బుద్ధ ప్రసాద్, సినీ కవులు సిరివెన్నెల, భువన చంద్ర, రామ జోగయ్య శాస్త్రి, అనంత శ్రీరాం, యింకా, "మిథునం" కథా రచయిత శ్రీరమణ, మాధవపెద్ది సురేష్, అందెశ్రీ, జనార్దన మహర్షి, పాలపర్తి అవధాని, ఆత్మీయురాలు బలభద్రపాత్రుని రమణి, నేమాని పార్థ సారథి, పరుచూరి గోపాల కృష్ణ, HMTV అధినేత శ్రీ రామ చంద్ర మూర్తి గారు మొదలైన వారు. అందరూ నాకు తెలిసిన వారే. ఇంతమంది మహానుభావులు అనేక అంశాలను ప్రస్తావిస్తూ చేసిన పొగడ్తలకి బాలూ అత్యంత ప్రతిభావంతంగా స్పందించారు. సమయమూ, ఆసక్తీ ఉన్న వారు ఈ క్రింది లంకెలో ఆ "అక్షరాంజలి" కార్యక్రమం అంతా చూడవచ్చును....నా ప్రసంగంతో సహా!

http://www.degaview.com/play/sp-balasubrahmanyam-ku-jai-telugu-aksharaanjali-spb-aksharaanjali-26-april-2013-part5-hmtvnews

అసలు విశేషం ఏమిటంటే, ఈ ఏప్రిల్ నెలలోనే, నా రెండు పుట్టిన రోజులూ, మా క్వీన్ విక్టోరియా గారితో పెళ్లి వార్షికోత్సవం, ఈ సాహిత్య, సత్కార సభలతో కోటా దాటిపోయింది. మే నెల ఎలా గడుస్తుందో చూడాలి మరి!

అన్నట్టు, గత జనవరి, 2013 లో నేను విజయనగరం వెళ్ళినప్పుడు మహాకవి గురజాడ గారి ఇంటికి వెళ్లి నా ఏమన్నా "సాహిత్యం పాపాలు" చేసి ఉంటే అవన్నీ కడిగేసుకున్నాను. ప్రభుత్వం వారు ఆ ఇంటిని ఇప్పుడు ఒక గ్రంధాలయంగా నడుపుతున్నారు. ఆయన ఇంటి ముందు నేను నిలబడ్డ ఫోటో, చాలా కొద్దిమందికే మాత్రమె ప్రవేశం ఇవ్వబడే ఆయన గదిలో ఆయన కుర్చీలోనే కూచుని ఉన్న నా ఫోటో ఇందుతో జతపరుస్తున్నాను. ఆయన దస్తూరీతో ఉన్న పుస్తకంలో నా అనుభూతులని క్లుప్తంగా వ్రాసే అవకాశం కూడా నాకు కలగడం నిజంగా నా పూర్వ జన్మ సుకృతమే!






మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

COMMENTS